క్లుప్తంగా

15వ రోజుకు చేరిన రైతుల ఆందోళన


దీక్షా శిబిరంలో రైతులు

కుప్పం రూరల్: కుప్పం మండలం ఆవులనత్తం జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళన సోమవారం 15వ రోజుకు చేరింది. ఫ్యాక్టరీ పనుల మూలాన తమ పొలాల్లో పంటలు సక్రమంగా పండడం లేదని, ఇళ్లు బీటలువారుతున్నాయని రైతులు ఫ్యాక్టరీ సమీపంలో దీక్షా శిబిరం ఏర్పాటు ఆందోళన చేస్తుండటం విదితమే. ఎండా వానలకు వెరవక రోజులు కాలంగా ఆందోళన చేస్తున్నా అధికారుల్లో చలనం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించండి

పుంగనూరు: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరల వినియోగం వైపు మొగ్గు చూపి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పీఆర్‌పీ భువనేశ్వరి కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సహజసిద్ధమైన కూరగాయల విక్రయాలను ప్రారంభించి ఆమె మాట్లాడారు. పలువురు కూరగాయలను కొనుగోలు చేశారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించాలని కోరారు.

అడిషనల్ కోర్టు ఏర్పాటుకు వినతి


ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు

పలమనేరు: పలమనేరులో అడిషనల్ కోర్టును త్వరితగతిన ఏర్పాటు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కోరారు. వారు మాట్లాడుతూ ఇక్కడ అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించడంతో గత ప్రభుత్వం ఇందుకు సంబంధించి పనులను పూనుకుని ఇప్పటికే పుంగనూరు, కుప్పంలో వాటిని ఏర్పాటు చేసిందన్నారు. కానీ పలమనేరులో మాత్రం ఇంకా ఏర్పాటు కాలేదని తెలిపారు. ఇప్పటికే ఇక్కడ గత 20 ఏళ్లుగా 5,500 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించి అడిషనల్ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీపతి, భరకర్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పుంగనూరు: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో సోమవారం పీఆర్‌టీయూ క్యాలెండర్లను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీవీ.రమణ, హెచ్‌ఎం రుద్రాణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఉపయుక్తమైన సమాచారంతో క్యాలెండర్లు, డైరీలను విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, అనురాధ, గీతాంజలి, శోభన, లతశ్రీ, భూదేవి, ముత్యాలు, విశాలాక్షి, సుగుణ, రామకృష్ణ, త్రివేణి, గాయిత్రి, జ్యోతి, ఆమని, జీవలత పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో అక్షరాస్యులు

పుంగనూరు: ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకుని ఉల్లాస్‌తో అక్షరాస్యులు కావాలని ఎంపీడీఓ లీలామాధవి కోరారు. సోమవారం మండల వలంటీర్లకు స్త్రీశక్తి భవన్‌లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలోని 25 మంది వలంటీర్లు గ్రామస్థాయిలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు ఉల్లాస్ కార్యక్రమం ప్రారంభించామన్నారు.

ఈరోజు

కలుపు నివారణపై రైతులకు శిక్షణ

శాంతిపురం: కలుపు నివారణ యంత్ర పరికరాల వినియోగం, సమగ్ర కలుపు నివారణపై మంగళవారం దండికుప్పంలో జిల్లా వ్యవసాయశాఖ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా స్థాయి వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు, పలమనేరు ఏడీఏ హాజరవుతారని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరకామణి లెక్కింపు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 9గంటలకు స్వామివారి పరకామణి(హుండీ లెక్కింపు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ పర్యవేక్షణాధికారి నీరుకుండ గజేంద్ర సోమవారం తెలిపారు. ఈ లెక్కింపులో ఆసక్తి గల భక్తులు(కేవలం పురుషులు మాత్రమే) సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చని తెలియజేశారు.



దయ చూపవేమి తిరుమలేశా..!

> మైళ్లకు మైళ్లు నడచితిమి స్వామీ
> ఎండైనా, వానైనా, నిశి రాత్రి చీకటైనా
> ఒకటే జపం..నీ నామస్మరణం
> దారిలో బస ఇబ్బందులు కనవేమి స్వామీ
> ఇకనైనా దయ చూపు తిరుమలేశా..!

అని కీర్తనకారుల మల్లే శ్రీవారి భక్తజనం ఇబ్బందులనూ నివేదిస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి గుంపులు..గుంపులుగా కాలినడక వెళుతున్న భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. ఇక పలమనేరు, కుప్పం ప్రాంతాల నుంచి వైకుంఠ ఏకాదశి, శ్రావణ మాసాల్లో తిరుమలకు నడచివెళ్లే వారికీ కొదువ లేదు. అయితే కాలినడక భక్తులు రాత్రిపూట బసచేయాలన్నా లేదా ఎందకు విశ్రాంతి తీసుకోవాలన్నా, భోజనాలు వండుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ధార్మిక కార్యక్రమాలు అమలు చేస్తున్న టీటీడీ అక్కడక్కడా ధర్మసత్రాలు కట్టించి పుణ్యం కట్టుకోండి అని భక్తులు ఏళ్లకాలంగా కోరుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం ఒకింత ఆశ్చర్యం కలిగించక మానదు.

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, కోలారు, మాలూరు, కేజీఎఫ్, మైసూరు తదితర పట్టణాల నుంచి వేలాది మంది శ్రీవారి భక్తులు కాలినడకన తిరుమలకు వెళుతుంటారు. కేవలం బెంగళూరులోనే 80కి పైగా కాలినడక బృందాలున్నాయి. ఒక్కో బృందంలో 3 వేల నుంచి 5వేలమంది


కర్ణాటక రాష్ట్రం నుంచి కాలినడకన తిరుమలకు వెళ్తున్న శ్రీవారి భక్తులు

- కాలినడక భక్తులకు సౌకర్యాలు లేక ఇబ్బందులు
- కర్ణాటక నుంచి కాలినడకన తిరుమలకు వేలాదిమంది
- రాత్రి బస, వంటకు తప్పని ఇబ్బందులు
- ప్రత్యేకించి మహిళలు పడుతున్న అవస్థలు దయనీయం
- సత్రాలు కట్టించాలని కోరుతున్నా పట్టించుకోని టీటీడీ

వరకూ సభ్యులున్నారు. వీరు ఏడాదికి రెండు, మూడుసార్లు కోలారు, ముళబాగిల్, నంగిలి, పలమనేరు, బంగారుపాళెం, చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి మీదుగా శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు వెళుతుంటారు. ఇక తమిళనాడులోని క్రిష్ణగిరి, ధర్మపురి, హొసూరు జిల్లాల నుంచి పలమనేరు, చిత్తూరు మీదుగా, కర్ణాటకాలోని చింతామణి, శ్రీనివాసపుర, చిక్‌బళ్లాపూర్ ప్రాంతాల నుంచి మదనపల్లె, పీలేరు, భాకరాపేట మీదుగా కాలినడకన భక్తులు వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు. తమిళనాడులోని వేలూరు వైపు నుంచి వచ్చే భక్తులు కాట్పాడి, చిత్తూరు, పూతలపట్టు మీదుగా తిరుమలకు కాలినడకన వెళుతుంటారు.

రాత్రి బసకు తప్పని ఇబ్బందులు

బెంగళూరు నుంచి తిరుమలకు 240 కిలోమీటర్లు, చింతామణి నుంచి 280 కి.మీ, తమిళనాడులోని వేలూరు నుంచి 110 కిలోమీటర్ల దూరం ఉంది. వీరి ప్రయాణ దూరాన్ని బట్టి వారం నుంచి పది రోజుల వరకూ సాగుతుంది. ఈ సమయంలో మార్గమధ్యంలో ఎక్కడైనా బస చేయాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మహిళలు స్నానాలు చేయడం, దుస్తులు మార్చుకోవడానికి పడుతున్న ఇబ్బందులు చెప్పనవికావు. అన్నిటికీ చెట్ల చాటే దిక్కు.

దశాబ్దాల క్రితమే సత్రాలుండేవి

పలమనేరు నుంచి తిరుపతి, వేలూరు నుంచి తిరుపతి, తిరుత్తణి నుంచి తిరుపతి మార్గాల్లో దశాబ్దాల క్రితం ఆయా మార్గాల్లోని కొందరు శ్రీవారి భక్తులు కాలినడక భక్తులకోసం రోడ్డుపక్కన సత్రాలు నిర్మించారు. అయితే అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరి కనిపించకుండా పోయాయి. ఇప్పటికే ఆ ప్రాంతాల్లో కాలినడక సత్రాలగానే వీటికి పేరుంది. ప్రస్తుతం టీటీడీ అధికారులు కాలినడక భక్తులు ఎక్కువగా వచ్చే మార్గాల్లో కనీసం 30 కిలోమీటర్లకు ఓ సత్రాన్ని నిర్మించాలని శ్రీవారి భక్తులు కోరుతున్నారు. సత్రాల అందుబాటుంటే అక్కడ నీటి వసతి, వంటావార్పుకు, బస చేయడానికి ఇబ్బందులు ఉండవు. పైగా సత్రాలు ఉంటే జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కాలినడక భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది.


హైవేల పైనే భోజనాలు చేస్తున్న కాలినడక భక్తులు(ఫైల్)

టీటీడీ అధికారులు ఆలోచించాలి



కర్ణాటక నుంచి వచ్చే భక్తులు రోడ్లపైనే భోజనాలు, నిద్ర చేస్తున్నారు. మేము కొంతమందికి పలమనేరు సమీపంలో విడిదికి ఏర్పాట్లు చేస్తున్నాం. సత్రాలు నిర్మిస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. టీటీడీ దీనిపై దృష్టి సారించి ఆచరణాత్మక చర్యలు తీసుకుంటే భగవంతునికీ-భక్తుల నడుమ సత్రాలతో అనుసంధానం చేసినట్లవుతుంది.

–సీఎస్ నవీన్, శ్రీవారిభక్తుడు, పలమనేరు

ఇది దశాబ్దాల కల



కర్ణాటక నుంచి నిత్యం వందలాదిమంది భక్తులు కాలినడకన తిరుమలకు వెళుతున్నారు. మార్గ మధ్యంలో వారికి సమస్యలు తప్పడం లేదు. మూడు దశాబ్దాలుగా ఈ మార్గాల్లో సత్రాలు నిర్మించాలని టీటీడీ అధికారులను కోరుతూనే ఉన్నాం. ఇప్పటికైనా దీనిపై పాలకమండలి ఓ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

–రవీంద్రారెడ్డి, శ్రీవారి సేవకుడు, కాబ్బల్లి, పలమనేరు మండలం

జాతరకు ఏర్పాట్లు చేయరూ!

శాంతిపురం: కొలమడుగు పంచాయతీలోని కదిరి ముత్తనపల్లెలో 12 ఏళ్లకోసారి నిర్వహించే జాతరకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. సోమవారం ఎంపీపీ వసుంధర చాంబర్‌లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. కదిరిముత్తనపల్లెలో కురబ కులస్తుల జాతరలో స్థానికులతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి ఐదు లక్షల మంది వరకూ పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జాతర, పెండింగ్ బిల్లులపై ఉన్నతాధికారులకు మండల పరిషత్ నుంచి లేఖలు పంపాలని తీర్మానించారు. అధికార పార్టీ నాయకుల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించి సమగ్ర కార్యచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ శివయ్యలను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి, ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.


సమావేశమైన ఎంపీటీసీలు, సర్పంచులు

బారికేడ్ల వద్దే వ్యాపారాలు!

- పట్టణంలో తప్పని ట్రాఫిక్ సమస్య

పలమనేరు: పట్టణంలో కొన్నాళ్లుగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులు సరస్వతి కేఫ్ ఎదురుగా మున్సిపాలిటీకి వెళ్లే దారిలో బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు బ్యారికేడ్ల వద్ద దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో మరిన్ని ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా గంగమ్మగుడి వీధిలో శివాలయం వద్ద, ఎస్‌బీఐ వద్ద అక్కడున్న దుకాణదారులు వారి గదుల ముందు రోడ్డుపైకొచ్చి దుకాణాలను పెట్టుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే మున్సిపల్ సమావేశాల్లో సభ్యులు అధికారులకు కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై దుకాణదారులతో మున్సిపల్ అధికారులు, పోలీసులు చర్చించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


సరస్వతి కేఫ్ ఎదురుగా బారికేడ్ల ముందు వెలిసిన వ్యాపార దుకాణాలు

రైతాంగ సమస్యలపై ఎంపీలకు లేఖ

పలమనేరు: జిల్లాలోని రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, కనీసం కేంద్ర ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల సమన్వయ సమాఖ్య ఆయా జిల్లాలోని ఎంపీలకు వినతిపత్రాలను పంపే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఎంపీ దుగ్గిమెళ్ల ప్రసాద్‌రావుకు ఇక్కడి రైతుల సమస్యలను తెలియజేస్తూ ఓ అర్జీని పోస్టులో పంపడంతోపాటు జిల్లా కేంద్రంలోని ఎంపీ వ్యక్తిగత సహాయకునికి సైతం అర్జీని అందజేసినట్టు తెలిపారు. ఈ సమస్యలపై ఈనెల 26న డివిజన్ కేంద్రాల్లో బైక్ ర్యాలీతో నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు. రైతు సంఘ నేతలు జనార్ధన్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ పీఏకు వినతిపత్రం ఇస్తున్న రైతు నేతలు

కోతులు తెచ్చిన ఉపద్రవం!

- చెట్టు నుంచి పడి వ్యక్తికి గాయాలు

కుప్పం రూరల్: కోతులను తరిమేందుకు చెట్టెక్కితే కింద పడి ఆస్పత్రి పాలయ్యాన్రా దేవుడా! అని ఓ వ్యక్తి బావురుమనాల్సి వచ్చింది. సోమవారం ఈ సంఘటన కుప్పం మండలం ఊరునాయునిపల్లెలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం.. గ్రామానికి చెందిన మల్లప్ప తన పొలం సమీపంలో చెట్లపైకి కోతులు చేరుకుని పంటలను నష్టం కలిగిస్తుండడంతో వీటి బెడద ఆయనకో సమస్యగా మారింది. సోమవారం ఉదయం చింతచెట్టు నుంచి గుంపుగా పంటలపైకి వచ్చేందుకు ఉన్న కోతులను చూసిన మల్లప్ప వాటిని తరిమేందుకు చెట్టు ఎక్కాడు. అయితే అదుపు తప్పి జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో మల్లప్ప చేయి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు మల్లప్ప కుప్పంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బనకందొడ్డిలో 'ఫ్యామిలీ డాక్టర్'

పెద్దపంజాణి: మండలంలోని బనకందొడ్డిలో పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి మురళి సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆ తర్వాత గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకే వెళ్లి పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్‌ఎం వసంతకుమారి ఆశావర్కర్లు శ్రావణి, వసుంధర, నారాయణమ్మ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

ప్రభుత్వ బడుల తనిఖీ


పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓలు

పలమనేరు: సంక్రాంతి సెలవుల అనంతరం తెరుచుకున్న పలు ప్రభుత్వ బడులను సోమవారం స్థానిక ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక నార్త్ ప్రైమరీ స్కూల్‌లో ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు, అక్కడున్న విద్యార్థులు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. టాయ్‌లెట్ల శుభ్రతను గమనించారు. హెచ్‌ఎం ఇందిర, సీఆర్పీలు పాల్గొన్నారు.

22న విద్యుత్ అదాలత్

పలమనేరు: పట్టణంలోని తమ కార్యాలయం వద్ద ఈనెల 22న ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పెషల్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, పుంగనూరు ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి పాల్గొంటారని, విద్యుత్ వినియోగదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభినందన


రిషబ్ ఓస్వాల్‌ను అభినందిస్తున్న సీఎం

పలమనేరు: సీఏ పరీక్షల్లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన ఆర్ రిషబ్ ఓస్వాల్‌ను సీఎం కార్యాలయ పిలుపు మేరకు ఓస్వాల్ తన తండ్రితో పాటు సీఎం నివాసంలో ఆదివారం ఆయన్ను కలిశారు. సీఎం రిషబ్‌ను సన్మానించి అభినందించారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి ఏపీని ప్రతిష్టను నిలబెట్టావని సీఎం ప్రశంసించినట్టు వారు తెలిపారు.

25న మండల సమావేశం

రొంపిచెర్ల: ఈ నెల 25న శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సోమ వారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై హల్‌చల్ చేసిన పుష్పా


ముసలిమొడుగు వద్ద రోడ్డుపై ఉన్న పుష్పా ఏనుగు

పలమనేరు: మండలంలోని ముసలిమొడుగు వద్ద పలమనేరు–గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై గుంపు విడిచి తిరుగుతున్న పుష్పా అనే మదపుటేనుగు సోమవారం సాయంత్రం రోడ్డుపై హల్‌చల్ చేసింది. ఈ ఏనుగు ఎంతసేపటికీ రోడ్డుపైనే ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు హడలిపోయారు. వాహనాలను ఆపి డ్రైవర్లు భయం..భయంగా నిరీక్షించాల్సి వచ్చింది. మరో వైపు ద్విచక్రవాహనాదారులు ఏనుగును చూసి వెనక్కు వెళ్లిపోయారు. రోడ్డు సమీపంలోని సోలార్ ఫెన్సింగ్‌ను తెంచి ఈ ఏనుగు రోడ్డుపైకి వచ్చినట్టు స్థానికులు తెలిపారు. జనంపై దాడులు, పొలాలవద్ద ఇళ్లను ధ్వంసం చేస్తున్న ఈఏనుగును కట్టడి చేసేందుకు ఎలిఫెంట్ ట్రాకర్స్ సైతం ఏమీ చేయలేకపోతుండడం కొసమెరుపు.

హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే జరిమానా

చౌడేపల్లి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తామని సీఐ రాంభూపాల్ హెచ్చరించారు. సోమవారం పుంగనూరు మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సు లేనివారికి, నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మోటార్ సైక్లిస్టులు విధిగా హెల్మెట్ ధరించడంతోపాటు రోడ్డు భద్రతా నియమాలను పాటించాన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడంతోనే తరచూ ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారన్నారు. మైనర్లకు వాహనాలిస్తే వాహన యజమానితోపాటు తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని, మద్యం సేవించి డ్రైవింగ్‌లో పట్టుబడితే రూ.10 వేలు జరిమానాతోపాటు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు.


వాహనాల తనిఖీలో పట్టుబడిన వారికి జరిమానా విధించి మాట్లాడుతున్న సీఐ



పట్టణంలో మంచుతెరలు వీడకపోవడంతో ఉదయం 7 గంటలైనా చీకటి తొలగడం లేదు. సోమవారం పట్టణాన్ని మంచు దట్టంగా కమ్మేసింది. ఉదయం నుంచి జనం తమ అవసరాల కోసం బయట వచ్చినా మంచుతో కూడిన చలి అధికంగా ఉండటంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

–పుంగనూరు

సంక్రాంతి సంతలో జోరుగా విక్రయాలు

పుంగనూరు: సంక్రాంతి సంబరాలకు పట్టణాల నుంచి స్వగ్రామాలకు గ్రామీణులు తరలిరావడంతో పల్లె సీమలు కళకళలాడుతున్నాయి. ఈ ప్రాంతంలో సంక్రాంతి ఫిబ్రవరి 10 వరకు నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం పట్టణంలో సంక్రాంతి సంత జోరుగా సాగింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమకు అవసరమైన రంగవల్లులు, పూలు, అనపకాయలు, గుమ్మడికాయలు, సొరకాయలు, చెరకు మొదలైన వాటిని కొనుగోలు చేశారు. ప్రతి ఇంటా పశువులను నీటితో శుభ్రం చేసి, గంటలు, గజ్జలు, బెలూన్లు కట్టి ఊరేగింపు నిర్వహించారు. పశువులను చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లి అక్కడ కాటమరాజు ఆలయాల వద్ద పూజలు చేసి, చిట్లాకుప్పలకు నిప్పు పెట్టి, పశువులను ప్రదక్షిణ చేయించి, దిష్టిపరిహారం చేశారు. ఇలా చేస్తే పశువుల సంతతి, వ్యవసాయం వృద్ధి చెందుతుందని ప్రతీతి. మహిళలు గొబ్బెమ్మలతో ఇళ్లముందు గొబ్బిపాటలు పాడారు.


పుంగనూరులో సంక్రాంతికి పూలు, వస్తువులను విక్రయిస్తున్న దుకాణాలు